క్లుప్తంగా

విగ్రహాల వితరణ



వితరణ చేసిన విగ్రహాలు

నరసన్నపేట: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో రాజీవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీతారామ ఆలయానికి ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు విగ్రహాలను వితరణ చేశారు. సీతారాముడు, లక్ష్మణుడి ఇత్తడి విగ్రహాలను రాజీవ్ సేవా సంఘం అధ్యక్షుడు పతివాడ గిరీశ్వరరావుకు సోమవారం అందించారు. ఆలయ నిర్మాణం చురుగ్గా జరుగుతుందని గిరీశ్వరరావు తెలిపారు.

ఆర్థిక నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

సరుబుజ్జిలి: ఆర్థిక నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ మోటివేటర్ సి.హెచ్.వెంకటేష్ (చిన్ను) తెలిపారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలు, టోల్‌ఫ్రీ నెంబర్లు గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.భూషణరావు, ఎన్ఎస్ఎస్ పీఓ దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో రక్షణ గోడలు



పురుషోత్తపురం సమీపంలో పాడైన రక్షణ గోడ

సరుబుజ్జిలి: ఆర్అండ్‌బీ రహదారిలో రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్రిడ్జీలు వచ్చేసరికి వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇరుకైన బ్రిడ్జీల వద్ద రక్షణ గోడలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడల మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని పలువురు కోరుతున్నారు.

పటిష్టంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సింహాచలం

నరసన్నపేట: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ ఎ.సింహాచలం ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన విధానాలు, నిబంధనలను వివరించారు. గ్రామాల్లో రాజకీయ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని, నాయకుల విగ్రహాలు ఉంటే వాటికి ముసుగులు వేయాలని సూచించారు. అధికారిక కార్యక్రమాలు నిర్వహించవద్దన్నారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీఓ బి.మధుసూదనరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నరసన్నపేట మేజరు పంచాయతీ ఈఓ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కలు



రుద్రాక్ష మొక్కలను నాటుతున్న సర్పంచ్ రామారావు, మిశ్రో మాస్టారు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) పునరావాస కాలనీలో గల రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ నాయకుడు ఎం.కె.మిశ్రో, స్థానిక సర్పంచ్ రెడ్డి రామారావు రుద్రాక్ష మొక్కలను నాటారు. రుద్రాక్ష మొక్కలను మిశ్రో మాస్టారు సమకూర్చగా సర్పంచ్ సోమవారం నాటించారు. అరుదైన జాతికి చెందిన రుద్రాక్ష మొక్కలను రక్షించే బాధ్యత ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులకు అప్పగించారు.

సామాజిక తనిఖీ అభియోగాలపై

వివరాల సేకరణ

- నివేదిక డ్వామా పీడీకి అందజేస్తాం
- జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు



వివరాలు సేకరిస్తున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

మెళియాపుట్టి: మండలంలో ఇటీవల నిర్వహించిన 13, 14, 15వ విడతల ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో గుర్తించిన పలు అంశాలపై శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు వివరాలు సేకరించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో పలు అభియోగాలకు సంబంధించి సిబ్బంది వద్ద ఆధారాలు తీసుకున్నారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాల్లో.. చనిపోయిన మొక్కల స్థానంలో మరలా మొక్కలు నాటినట్లు (రీప్లేస్‌మెంట్) గుర్తించారు. అదేవిధంగా పనులు చేసిన స్థలాల్లో వివరాలు తెలిపే సూచికలను పెట్టలేదనే విషయాన్ని అప్పటికి తనిఖీ చేసినవారు గుర్తించారు. వాటికి సంబంధించిన ఎఫ్‌టీఓలు ఆలస్యంగా రావడంతో ఇటీవల అన్ని పనుల వద్ద సూచికలు ఏర్పాటు చేశామని దానికి సంబంధించిన ఫొటోలు, వివరాలు సిబ్బంది అందజేశారు. అనంతరం విజిలెన్స్ అధికారి లవరాజు మాట్లాడుతూ.. సిబ్బంది వద్ద సేకరించిన వివరాలను జిల్లా నీటియాజమాన్య సంస్థ పథకసంచాలకులు జి.వి.చిట్టిరాజుకు సమర్పించనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పనులు, కొలతల్లో తేడాలు, విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సురేష్, హెచ్.ఆర్ మేనేజర్ శ్రావణ్ కుమార్, మెళియాపుట్టి ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీడీ తెంబూరు రవి, ఏపీఓ సురేష్, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు



జీడి పరిశ్రమ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: కొన్ని నెలలకు బాండ్ రాయించుకుని బాలలతో పనులు చేయిస్తున్నారన్న సమాచారంతో శ్రీకాకుళం పోలీసులు సోమవారం మండలంలోని చాపరలోని రామకృష్ణ, శిరామకృష్ణ జీడి పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలను పాఠశాలలకు పంపించకుండా పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మానవ అక్రమరవాణాలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు జాతీయ బాలికల సంరక్షణా విభాగానికి చెందిన అధికారి బాలకృష్ణ, మెళియాపుట్టి తహసీల్దార్ సరోజిని అన్నారు. వీరు జీడి పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళలకు అవగాహన కల్పించారు. ఏఎస్‌టీయూ సిబ్బంది, ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ రమణమూర్తి, మెళియాపుట్టి ఎస్ఐ అప్పన్న, చైల్డ్‌లైన్ సిబ్బంది పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

15న ఏఐఆర్‌లో కొండలరావు ప్రసంగం



వాండ్రంగి కొండలరావు

పొందూరు: అంతర్జాతీయ తెలుగు కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు జీవితం, సాహిత్యం అనే అంశంపై స్థానిక సాహితీవేత్త వాండ్రంగి కొండలరావు ప్రసంగించనున్నారు. ఆకాశవాణి (ఏఐఆర్) విశాఖపట్నం కేంద్రంలో ఈ నెల 15న ఉదయం 7.15 గంటలకు ప్రసారం ఉంటుంది. ఈ మేరకు ఏఐఆర్ అధికారులు రచయితకు సోమవారం ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఆమదాలవలస రూరల్: మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో రామమందిరం వెనుక భాగంలో గల మంచినీటి బోరు మరమ్మతులకు గురికావడంతో సోమవారం బాగు చేశారు. మంచినీటి బోరు మొరాయించడంతో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న నివాసితులు స్థానిక సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు దృష్టికి తీసుకురావడంతో వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలో తీసుకువచ్చారు. పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచ్ తెలియజేశారు. బోరు బాగు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదాయ మార్గాలపై దృష్టి



సమావేశంలో పాల్గొన్న వైకేపీ అధికారులు, సభ్యులు

సరుబుజ్జిలి: మహిళా స్వయంశక్తి సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని వైకేపీ ఏరియా కో-ఆర్డినేటర్ బెవర నారాయణరావు తెలిపారు. సింధువాడ గ్రామం రామలక్ష్మణ స్వయంశక్తి సంఘ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, వినియోగిస్తున్న విధానం గురించి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైకేపీ ఏపీఎం కమలకుమారి పాండ్యన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

హిరమండలం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 పనితీరుపై లబ్ధిదారులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, రణస్థలం సీడీపీఓ జాన్సీ వచ్చి విచారణ చేపట్టారు. కేంద్ర నిర్వహణ, సరుకుల నిల్వ రిజిస్టర్లు తనిఖీ చేపట్టారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా, లేదా అని ఆరా తీశారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. స్థానిక ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుధావాణి ఉన్నారు.

అక్రమ పట్టాలపై విచారణ చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 పునరావాస కాలనీలో అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చేపట్టిన విచారణ పారదర్శకంగా లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, గొంటి రమేష్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ పి.బాలకు దీనిపై వినతిపత్రం అందజేశారు. రౌతు సూర్యనారాయణ, అనంతరావు, బోర ఢిల్లేశ్వరరావుతోపాటు పలువురిపై విచారణ పూర్తిస్థాయిలో చేపట్టాలేదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్టూరు బిట్-1 కాలనీ, కుంటిభద్ర, ఇరపాడుగూడతోపాటు మరో రెండు గ్రామాలు నుంచి ఐదు వినతులు అందినట్లు తహసీల్దార్ చెప్పారు.

అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి



చిన్నారులకు దుస్తులు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాతపట్నం:

అనాథ చిన్నారులకు చేయూతనిస్తే వారు అన్ని రంగాల్లోనూ రాణిస్తారని బాసిన శంకర్ అన్నారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అనాథ ఆశ్రంలోని చిన్నారులకు శంకర్, భార్య శాంతి దుస్తులు, బిస్కెట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అనాథ చిన్నారులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఆశ్రమం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పరామర్శ..



శ్రీరామ వరప్రసాదమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సువ్వారి గాంధీ

బూర్జ: మండలంలోని అల్లెన టీడీపీ ఎంపీటీసీ శ్రీరామ వరప్రసాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుమారుడు వావిలాపల్లి రాంజీకి వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి గాంధీ సోమవారం పరామర్శించారు. వరప్రసాదమ్మ చిత్రటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పది లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

మెళియాపుట్టి: అక్రమంగా సారాను తరలిస్తుండగా మెళియాపుట్టి పోలీసులు సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు 10 లీటర్ల సారా తరలిస్తున్న వీరిని బాణాపురం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వీరు బాణాపురం పంచాయితీ పరిధిలోని గుమ్మడ గ్రామానికి చెందినవారన్నారు. అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తామన్నారు.

బొమ్మాళమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని బసివలస గ్రామంలో గల బొమ్మాళమ్మ పేరంటాల వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు ముర్రాటలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. చీరలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణ పరిధిలో గల 11 కేవీ టౌన్‌వన్ ఫీడర్ మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగించే పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సొట్టవానిపేట, సొట్టవానిపేట కాలనీ, టీఆర్‌జీ నగర్, రమేష్ జీడిపప్పు ఫ్యాక్టరీ, ఎఫ్‌సీఐ, గ్యాస్ గొడౌన్, జీఎల్ ఫంక్షన్‌హాల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం

సారవకోట: మండలంలో మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ప్రవల్లికాప్రియ తెలిపారు. కుమ్మరిగుంట రైతు భరోసా కేంద్రంలో పరిధిలో రైతులు సోమవారం స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు ప్రాప్తికి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మండలంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఈకేవైసీ శతశాతం పూర్తిచేయాలి

పాతపట్నం: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పంటల బీమా పొందడానికి ఈకేవైసీని శతశాతం పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి కింజరాపు రవికుమార్ అన్నారు. మండలంలోని కొరసవాడ ఆర్‌బీకేలో సోమవారం వీఏఏ, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. మండలం వ్యాప్తంగా 50 శాతం ఈకేవైసీ పూర్తయిందని, ఇంకా 50 శాతం నమోదు కాలేదన్నారు. రెండు రోజుల్లో పూర్తిచేయాలని వీఏఏలకు ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అక్కరకురాని అండర్ టన్నెల్!

- మురుగునీటి నిల్వతో రాకపోకలకు అవస్థలు



మురుగు నీటిలో వాహనదారుల కష్టాలు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణం, మెట్టెక్కివలస ప్రాంతాలను కలిపేందుకు ఇందిరా గాంధీ పాత రైల్వేగేట్ సమీపంలో నిర్మించిన అండర్ టన్నెల్‌తో నిత్యం రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. టన్నల్ నిర్మాణ పనులు జరిగే సమయంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో నిరంతరం మురుగునీరు నిల్వ ఉంటుంది. అండర్ టన్నెల్ నిర్మాణం జరిగితే ప్రజల రాకపోకలకు ఎంతో లాభం చేకూరుతుందని భావించిన పట్టణ ప్రజానీకానికి లాభమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్న గేటును మూసివేసి టన్నెల్ ఏర్పాటు చేసినా ప్రజా అవసరాలకు ఉపయోగం లేకుండాపోతుందని వాహనదారులు అంటున్నారు. అండర్ టన్నెల్ నిర్మాణానికి రైల్వే నిధులు సుమారు రూ.4.50 కోట్లు వెచ్చించి పనులు పూర్తిచేశారు. టన్నెల్ లోపల లీకేజీలు ఏర్పడి మురుగునీరు నిల్వ అవుతుంది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. మెట్టెక్కివలస ప్రాంతంతోపాటు మరో పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే విధంగా, శ్రీకాకుళం పట్టణానికి చేరుకునే వాహనదారులకు వీలుగా దీనిని నిర్మించినా ఉపయోగకరంగా ఉండడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అండర్ టన్నెల్ లోపల ఉన్న గోడల నుంచి లీకులు రావడం వల్ల నిత్యం మురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ నీటి నిల్వను మోటార్ ద్వారా తోడే బాధ్యతను మున్సిపాల్టీకి రైల్వేశాఖ అప్పగించింది. మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం వల్ల టన్నెల్ మార్గం ద్వారా రాకపోకలు సాగించడానికి వీలుకలగడం లేదు. ఇప్పటికైనా రైల్వే, మున్సిపల్ అధికారులు స్పందించి వాహనాల రాకపోకలకు వీలుగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

లెప్రసీపై అప్రమత్తం



మాట్లాడుతున్న వాన సురేష్

నరసన్నపేట: లెప్రసీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి 30 నుంచి నిర్వహిస్తున్న స్పర్శ పక్షోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. దీంట్లో పాల్గొన్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ మాట్లాడుతూ విద్యా సంస్థల్లో లెప్రసీపై అవగాహన కలిగించామన్నారు. ప్రతి ఒక్కరూ లెప్రసీపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. హెచ్ఎం కృష్ణంరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దైవ కటాక్షం, హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

నరసన్నపేట: సర్కారు పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఎంఈఓ శాంతారావు అన్నారు. సోమవారం లకిమేర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కొన్ని స్కూళ్లలో నాణ్యత తక్కువగా ఉంటుందనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. హెచ్ఎంలు వంటలను పరిశీలించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందివ్వాలని, రుచిగా, శుభ్రంగా ఉండాలని వంట ఏజెన్సీ మహిళలకు ఆదేశించారు. విద్యా ప్రమాణాలను తరగతుల వారిగా తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులకు సూచించారు.

సర్వీస్ రోడ్డు ప్రారంభం



నిర్మాణం పూర్తయిన సర్వీసు రోడ్డు

పాతపట్నం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో పాతపట్నం అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా సర్వీసు రోడ్డు సోమవారం ప్రారంభించారు. కొరసవాడ నుంచి పాతపట్నం వస్తున్న రోడ్డులో ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించారు. వేంకటేశ్వర ఆయలం నుంచి పెంట్రోల్ బంక్ వరకు 1.45 మీటర్లు మాత్రమే ఉండటంతో.. సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇప్పటికే తిలారు, పాతపట్నం ఫ్లైఓవర్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సర్వీసు రోడ్డు పనులను జేఈ బి.రఘు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

158 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 158 మందికి శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, టుడీకో, బీపీ, సుగర్, కంటి పరీక్షలతోపాటు సాధారణ తనిఖీలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్, ఏరియా మేనేజర్ కె.సంతోషరాజేశ్వరరావు, పీఆర్ఓ దుర్గారావు, ఎంఎల్‌హెచ్ స్వర్ణలత, ఆశ కార్యకర్త సుగుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతతో సమస్యలకు పరిష్కారం



ధర్మప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: భగవద్గీత పవిత్రతను కాపాడి, హిందూధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా సాగాలని హిందూ జ్ఞాన ప్రచారవేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో సోమవారం భగవద్గీత ఆవశ్యకతపై కరపత్రాలు పంపిణీ చేసి ధర్మప్రచారం నిర్వహించారు. భగవద్గీతలో ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుందన్నారు. జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• చిట్టి చేతుల పంట



పాతపట్నం మండలంలోని కొదూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్ఎం అల్లాడ అప్పలస్వామి ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు కూరగాయలు పండించారు. పండించిన క్యాబేజీ దుంపలు, కూరగాయలను విద్యార్థులు సోమవారం ప్రదర్శించారు. మధ్యాహ్న భోజనంలో వీటిని ఉపయోగిస్తున్నామని హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయుడు ఎల్.గోవిందరావు, కర్రెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- పాతపట్నం